
సాక్షి వనపర్తి

శుక్రవారం : 24 : మే : 2024



బదిలీలు జరిగేనా..?

దేవాదాయశాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది.

వివరాలు 8లో ▸



మార్మోగిన నామస్మరణ

బీచుపల్లి అంజనేయస్వామి రథోత్సవం గురువారం రాత్రి వైభవంగా జరిగింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
40.0 /26.9

రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోత తప్పదు.

న్యూస్‌రీల్

పనుల్లో వేగం పెంచాలి



అమరచింత: పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలతో పాటు స్కూల్ యూనిఫామ్స్ కుట్టే కేంద్రం, మండలంలోని చింతరెడ్డిపల్లి, నందిమళ్ల ఎక్స్‌రోడ్, కిష్టంపల్లిలోని పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసినా పనులు ఎందుకు ప్రారంభించ లేదని ఎంఈఓను ప్రశ్నించారు. పాఠశాలకు సంబంధించిన నిధులు జెడ్పీ ఉన్నత పాఠశాల ఖాతాలో జమయ్యాయని.. బదిలీ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఎంఈఓ బదులిచ్చారు. ఇన్‌చార్జ్ డీఈఓ గోవిందరాజులుకు ఫోన్ చేసి సమస్యను త్వరగా పరిష్కరించాలని సూచించారు. విద్యార్థుల యూనిఫామ్స్ తయారీ ఎంతవరకు వచ్చిందని మెప్మా అధికారులను ప్రశ్నించగా కటింగ్ కోసం వస్త్రాన్ని పాలమూర్‌కు పంపామని కో–ఆర్డినేటర్ యువరాజ్ సమాధానం ఇవ్వగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల పునః ప్రారంభం నిర్మాణ పనులతో పాటు యూనిఫామ్స్ పూర్తి చేయాలని.. ఇందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ నూరుల్ నదీం, ఎంపీడీఓ కృష్ణయ్యను ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓ భాస్కర్‌సింగ్, ఎంపీఓ నరసింహులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య..

ఆత్మకూర్: తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత పెంపొందించేందుకు కృషి చేస్తోందని.. అందులో భాగంగానే అమ్మ ఆదర్శ పాఠశాలలను ప్రవేశపెట్టిందని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఉర్దూ మీడియం, జూరాల, ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని 18 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేశామని, ఆయా పాఠశాలల్లో విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు సమకూర్చుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందనుందని.. ఉపాధ్యాయులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఆయన వెంట ఎంఈఓ భాస్కర్‌సింగ్, ఎంపీడీఓ సుజాత, కమిషనర్ నాగరాజు, ఎంపీఓ నర్సింగ్‌రావు, జీహెచ్‌ఎంలు ఉన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారు దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. శివపార్వతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా.. ఆడపడుచులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

పాలమూరులో కలకలం

లక్ష్మీపల్లిలో బీఆర్ఎస్ నేత దారుణ హత్య



శ్రీధర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే బీరం తదితరులు

- రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటన
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు
- రాజకీయ హత్యలంటూ కేటీఆర్ ఆరోపణ
- చిన్నంబావి చౌరస్తాలో నిరసన తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి/ చిన్నంబావి: కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన మండల స్థాయి బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి(50) హత్య ఉమ్మడి పాలమూరులో కలకలం రేపింది. హత్యా ఘటన సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఉమ్మడి జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు చిన్నంబావికి చేరుకుని మృతుని కుటుంబాన్ని పరామర్శించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. శ్రీధర్‌రెడ్డి పార్థివదేహం స్వగ్రామానికి తరలిస్తుండగా.. ఆయన వాహనం ముందు పార్టీ శ్రేణులతో సుమారు నాలుగు కిలోమీటర్లు కాలినడక లక్ష్మీపల్లి వరకు రావడం కార్యకర్తల్లో చర్చనీయాంశమైంది. అందరి నోట మంచోడు అనిపించుకున్న నాయకుడిని దారుణంగా గొడ్డళ్లు, కత్తులతో దాడిచేసి హతమార్చడాన్ని గ్రామస్తులతోపాటు మండల ప్రజలు, బీఆర్ఎస్ మండల నాయకులను కన్నీళ్లు పెట్టించింది. ఎప్పటిలాగే.. ఇంటికి సమీపంలోని కల్లందొడ్డిలో నిద్రిస్తున్న వ్యక్తిని తెల్లవారే సరికి హతమార్చడం, విగతజీవిగా గ్రామస్తులకంట పడటంతో చిన్నంబావి మండలం శోకసంద్రంలో మునిగిపోయింది. అయితే శ్రీధర్‌రెడ్డి అవివాహితుడు కాగా.. తల్లిదండ్రులు శేఖర్‌రెడ్డి, యశోద ఉన్నారు. మరోవైపు నాలుగు నెలల వ్యవధిలో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఇద్దరు హత్యకు గురికావడం రాజకీయంగా పాలమూరుతోపాటు రాష్ట్రంలోనే కలకలం రేపినట్లయింది.



శ్రీధర్‌రెడ్డి తల్లిని ఓదారుస్తున్న కేటీఆర్

డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన

హత్యా ఘటన సమాచారం తెలుసుకున్న వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ నాగభూషణరావు సంఘటనా స్థలానికి ఉదయమే చేరుకుని విచారణ జరిపారు. అలాగే డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. పోలీసులు తీసుకువచ్చిన జాగిలం హత్యా ఘటన ప్రదేశం నుంచి సమీపంలోని బావి వద్దకు వెళ్లి అక్కడి నుంచి వాగువైపు వెళ్లింది. సరైన ఆధారాలు లభించకపోవడంతో పథకం ప్రకారమే హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు

శ్రీధర్‌రెడ్డి హత్య ఘటనపై తండ్రి శేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని వనపర్తి సీఐ నాగభూషణరావు తెలిపారు. ఇప్పటికే కొందరిని అనుమానితులుగా గుర్తించామని పేర్కొన్నారు. సమగ్రంగా విచారణ చేస్తున్నామని, హత్యకు గల కారణాలను అన్ని కోణాల్లో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మండల కేంద్రంలో నిరసన

బీఆర్ఎస్ ముఖ్యనేత శ్రీధర్‌రెడ్డి దారుణ హత్య ఘటనను నిరసిస్తూ కొద్దిసేపు మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు చిన్నంబావి ప్రధాన కూడలిలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో కొత్తగా హింసాయుత వాతావరణం నెలకొన్నా.. పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, పార్టీ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. కొల్లాపూర్ నియోజకవర్గాన్ని కల్లోల ప్రాంతంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవద్దని ముందస్తుగా డీజీపీని కలిసి ఫిర్యాదు ఇచ్చినా.. మార్పు లేదని, రాష్ట్ర పోలీసులపై తమకు నమ్మకం లేదంటూ సంచలన వాఖ్యలు చేశారు. శ్రీధర్‌రెడ్డి హత్య ఘటనపై తెల్లవారుజాముల 5.30 గంటలకు సమాచారం ఇస్తే.. గంటన్నర తర్వాత పోలీసులు రావడం దారుణమన్నారు. ఆలస్యంగా అక్కడికి వచ్చిన చిన్నంబావి ఎస్ఐని సస్పెండ్ చేయాలని కోరారు. ఇంటికి పెద్దదిక్కుగా ఉండే కొడుకును రక్తపు మడుగులో చూసి తట్టుకోలేకపోతున్న శ్రీధర్‌రెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డిని ఓదార్చలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హత్యా రాజకీయాలకు ఎవరూ భయపడావల్సిన అవసరం లేదని, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని కొల్లాపూర్ నాయకులు, కార్యకర్తలకు ధైర్యమిచ్చే ప్రసంగాలు చేశారు.



శ్రీధర్‌రెడ్డి మృతదేహం



పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కో–ఆర్డినేటర్, ప్రత్యేక పరిశీలకుడు

నేడు పాలిసెట్

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నిమిషం నిబంధన కచ్చితంగా అమలు

వనపర్తిటౌన్: జిల్లాలో శుక్రవారం పాలిసెట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ డా. కె.చంద్రశేఖర్ గురువారం కేంద్రాల వారీగా కల్పించిన వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష జరగనుంది. విద్యార్థులను కేంద్రాల్లోకి గంట ముందే అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైన అనుమతించరని, నిమిషం నిబంధన కచ్చితంగా అమలు చేస్తామని కో–ఆర్డినేటర్ తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు నిర్ణీత సమయానికి కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 10 పరీక్ష కేంద్రాల్లో 2,394 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని.. ఇందులో బాలురు 1,261, బాలికలు 1,133 మంది ఉన్నారు. పరీక్ష నిర్వహణకు 100 మందికి పైగా ఇన్విజిలేటర్లు, 10 మంది సీఎస్‌లు, ముగ్గురు రూట్ ఆఫీసర్లు, పాలిటెక్నిక్ కళాశాల పరీక్ష కేంద్రం మినహా మిగతా ప్రతి కేంద్రానికి ఒక్కో పరిశీలకుడి చొప్పున మొత్తం 9 మంది విధులు నిర్వర్తించనున్నారు. కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉండనుంది. కేంద్రాల్లోకి ఎలాంటి ఎల్రక్టానిక్ పరికరాలను అనుమతించరు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఐఈఓ మద్దిలేటి

వనపర్తి టౌన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గురువారం జిల్లాకేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను డీఐఈఓ మద్దిలేటి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కనీస సౌకర్యాలు కల్పించాలని సీఎస్, డీఓలను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకుగాను జిల్లావ్యాప్తంగా 13 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు జనరల్ విద్యార్థులు 3,499, ఒకేషనల్‌లో 479 మొత్తం 3,978.. రెండో సంవత్సరం పరీక్షలు జనరల్ విద్యార్థులు 1,780, ఒకేషనల్‌లో 376 మొత్తం 2,156 మంది రాయనున్నట్లు వెల్లడించారు.



జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈఓ

విత్తన మేళాకు వేళాయె

నేడు పాలెం పరిశోధన స్థానంలో నిర్వహణ

- ఏర్పాట్లు పూర్తి
- అందుబాటులో వరి, పెసర, కంది విత్తనాలు
- తక్కువ ధరకే రైతులకు నేరుగా అమ్మకాలు



పాలెం పరిశోధన స్థానంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న విత్తనాలు

సాక్షి, నాగర్‌కర్నూల్: రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకుగాను శుక్రవారం పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విత్తన మేళా నిర్వహించనున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెంలోని అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియం హాల్‌లో ఉదయం 10నుంచి సాయంత్రం 6 వరకు రైతులకు వివిధ రకాల విత్తనాలను అందుబాటులో ఉంచుతారు. రైతులు వానాకాలం సాగుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో బహిరంగ మార్కెట్‌లో వివిధ రకాల విత్తనాలతో పాటు నాసిరకం విత్తనాల బెడద పొంచి ఉంది. మేలైన విత్తనాల విషయంలో రైతులకు అవగాహన కల్పించేందుకు, వారికి తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలను అందించాలనే లక్ష్యంతో విత్తన మేళాను ఏర్పాటు చేస్తున్నారు.


కేవీకే శాస్త్రవేత్తల సూచనలు..

పాలెం అగ్రికల్చర్ యూనివర్సిటీలో రైతులకు అవసరమైన వరి, వేరుశనగ, జొన్న, కంది, మినుము, పెసర తదితర విత్తనాలను అందుబాటులో ఉంచుతారు. అందుకోసం ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటుచేయనున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, యూనివర్సిటీ ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో ఆధునిక వంగడాలు, సాగులో మెళకువలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఇటీవల కాలంలో పంటలను పట్టిపీడిస్తున్న చీడపీడలు, ఎరువుల వాడకం, సేంద్రియ సాగుపై సూచనలు అందిస్తారు. పాలెం ప్రాంతీయ పరిశోధన స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచారు. 94904 09163, 63008 20238 నంబర్లను సంప్రదించి విత్తనాలు పొందవచ్చు.

అందుబాటులో ఉన్న విత్తనాలు, వాటి ధరలు ఇలా..

విత్తనం రకం	బస్తా (కిలోల్లో..)	కిలో ధర (రూ.లలో..)
వరి ఆర్ఎన్ఆర్-15048	15	50
వరి జేజీఎల్-24423	25	44
వరి కేఎన్ఎం-1638	20	48
వేరుశనగ విశిష్ట రకం	30	108
తెల్లజొన్న సీఎస్‌వీ-41	3	90
పచ్చజొన్న పీవైపీఎస్-2	3	150
కంది పీఆర్‌జీ-176, టీడీఆర్‌జీ-59	3	150
మినుము ఎంబీజీ-1070	6	150
పెసర ఎంజీజీ-385	6	140

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..



రైతుల కోసం శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు విత్తన మేళా నిర్వహిస్తున్నాం. వచ్చే నెల మూడో వారంలో రుతుపవనాలు వచ్చే అవకాశం ఉంది. రైతులు పూర్తి స్థాయిలో భూమి తడిసిన తర్వాతే విత్తనాలు వేసుకోవాలి. విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– మల్లారెడ్డి, పరిశోధన స్థానం ఏడీ, పాలెం

భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి

- కలెక్టర్ తేజస్ పవార్




అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తేజస్ పవార్

వనపర్తి: జిల్లాలో వివిధ విభాగాల కింద చేపడుతున్న భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ పవార్ అధికారులను ఆదేశించారు. భూ సేకరణ, ముంపు గ్రామాల పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ వారాంతపు సమీక్ష నిర్వహించారు. భూ సేకరణలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. భూ సేకరణ, పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన విషయంలో లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటి కాల్వలు, చెరువు కాల్వల స్థితిగతులను ముందుగానే తెలుసుకొని అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు లష్కర్లను పంపించాలని ఇరిగేషన్ అధికారిని ఆదేశించారు. చెరువు భూములు కబ్జా కాకుండా పరిరక్షించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నగేష్, భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ పద్మావతి, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ మల్లయ్య, ఇరిగేషన్‌శాఖ ఇంజినీర్లు, భూసేకరణ విభాగం నుంచి గోకుల్‌దాస్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు..

గోపాల్‌పేట: వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ పవార్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. మిల్లులకు తరలిన ధాన్యం లెక్కలను తేల్చి రెండ్రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కోరారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకొని వర్షం వస్తే వెంటనే కప్పాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారును ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శేఖర్ తదితరులు ఉన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి




రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రఘునాథ్‌రెడ్డి

- డీఎల్‌పీఓ రఘునాథ్‌రెడ్డి

పాన్‌గల్: గ్రామపంచాయతీల్లో రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని డీఎల్‌పీఓ రఘునాథ్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండా గ్రామపంచాయతీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చిన నిధులు, ఖర్చు చేసిన లెక్కల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి స్వచ్ఛంగా తీర్చిదిద్దాలని కోరారు. వర్షాకాలంలో నాటేందుకు అవసరమైన మొక్కలను సిద్ధం చేయాలని చెప్పారు. సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువు తయారీ, తాగునీటి సమస్యపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని నర్సరీలు, ప్రకృతి వనాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ రఘురాములు, పంచాయతీ కార్యదర్శి నర్మద పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి



మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

పాలమూరు: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషిచేయాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో గురువారం జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి పాలమూరులోని అన్ని జిల్లాల వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఏడీలు, అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు, ముఖ్య ప్రణాళిక అధికారులు, రైతులు పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ రవినాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగితే ఆర్థిక నష్టం జరగకుండా బీమా రైతులకు ప్రయోజనకరంగా రిస్క్ కవరేజీ కల్పిస్తుందన్నారు. ఫసల్ బీమా పథకం వానాకాలం సీజన్ నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో అనుభవం ఉన్న అధికారులు, రైతులు, శాస్త్రవేత్తలు తమ సూచనలు తెలియజేయాలని కోరారు. రాష్ట్రస్థాయిలో వ్యవసాయ శాఖ, ప్రభుత్వం ఫీడ్ బ్యాక్ ఆధారంగా మరింత సమర్థవంతంగా అమలుకు మార్గదర్శకాలు రూపొందిస్తుందని చెప్పారు. ఫసల్ బీమా పథకం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని, అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. పంటలకు నష్టం జరిగినప్పుడు దీని ద్వారా పరిహారం అందుతుందని, ఇందుకు సంబంధించి ప్రీమియం సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లిస్తాయని వివరించారు. అధికారులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులు ఆర్థిక అభివృద్ధి చెందేలా కృషి చేయాలన్నారు. ఫసల్ బీమా మార్గదర్శకాల మేరకు గ్రామం, మండలం యూనిట్‌గా పరిగణిస్తారని, పంట దిగుబడి, వాతావరణ పరిస్థితుల అనుగుణంగా బీమా నిర్ణయిస్తారని చెప్పారు. వ్యవసాయ అధికారులు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సూచనలు ఇవ్వాలన్నారు. మహబూబ్‌నగర్ రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి, మాస్టర్ ట్రైనర్ కృపాకర్‌రెడ్డి ఫసల్ బీమాపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ పథకం ప్రతి పంట వేసిన ప్రతి రైతుకు ఉపయోగపడేలా నోటిఫై చేసిన పంటలు, ఏరియాకు వర్తింపజేయడం, రైతు ప్రీమియం ప్రభుత్వం చెల్లించడం, టెక్నాలజీ బేస్ ఆధారంగా అమలు చేస్తారన్నారు. వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన పరిశీలకులు జేడీ శైలజ మాట్లాడుతూ ఫసల్ బీమాపై ఉమ్మడి జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యాలయ ఏడీ శ్రీదేవి, మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారులు, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, రైతులు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎదురెదురుగా బైక్, బొలెరో ఢీ

- ఒకరి దుర్మరణం.. మరో ఇద్దరికి గాయాలు


రామకృష్ణ (ఫైల్)

కొల్లాపూర్ రూరల్/ పెంట్లవెల్లి: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనం, బొలెరో ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలవగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. పెంట్లవెల్లి ప్రధాన రహదారిలో సోమశిల క్రాస్‌రోడ్డు దగ్గర గురువారం తెల్లవారుజామున 3 గంటలకు చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ హృషికేష్ కథనం ప్రకారం.. మంచాలకట్ట గ్రామానికి చెందిన మాసుం బొలెరోలో కొల్లాపూర్ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. అలాగే కొండూరుకు చెందిన ఏదుల రామకృష్ణ(40) స్వగ్రామం నుంచి తన కుమారులతో కలిసి తెల్లవారుజామున 3 గంటలకు హైదరాబాద్ వెళ్లడానికి కొల్లాపూర్ వస్తున్నాడు. ఈ క్రమంలో సోమశిల క్రాస్‌రోడ్డు దగ్గర ఎదురెదురుగా వస్తున్న సమయంలో బొలెరో, బైక్ ఢీకొనడంతో రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా.. కుమారులు అభిషేక్, కార్తీక్‌లకు ఇద్దరికి కాళ్లు విరిగి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులకు కొల్లాపూర్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై రామకృష్ణ భార్య అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బావిలో దూకి మహిళ బలవన్మరణం

లింగాల: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగన్మోహన్, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అంబట్‌పల్లికి చెందిన పార్వతమ్మ (42)కు గోపాల్‌పేట మండలం రేవల్లికి చెందిన ఆనంద్‌తో 20 ఏళ్ల కిందట వివాహం జరిగింది. ఆమెకు పిల్లలు పుట్టకపోవడంతో ఆనంద్ భాగ్యలక్ష్మి అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. కాగా ఆనంద్ అయిదేళ్ల కిందట మృతిచెందాడు. అప్పటి నుంచి పార్వతమ్మ, భాగ్యలక్ష్మి తరచూ గొడవపడేవారు. ఇదే క్రమంలో పార్వతమ్మ గురువారం అంబట్‌పల్లికి వచ్చిన ఆమె తనకు ఇల్లు కట్టించాలని అన్నను కోరగా కొన్నిరోజుల తర్వాత కట్టిస్తానని తెలిపారు. పుట్టింట, మెట్టినింట న్యాయం జరగడం లేదని మనస్తాపానికి గురై క్షణికావేశంలో బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఉరేసుకుని వ్యక్తి..

కొత్తకోట రూరల్: భార్యాభర్తల మధ్య గొడవ, ఆర్థిక ఇబ్బందులతో తాగుడుకు బానిసై ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జగత్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివకుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఆంజనేయులు (35)కు వనపర్తిలోని రాయిగడ్డకాలనీకి చెందిన సుజాతతో 2010లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా ఆంజనేయులు వనపర్తిలోనే నివాసం ఉంటూ మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల తాగుడుకు బానిసకావడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. బుధవారం జగత్‌పల్లికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన ఆంజనేయులు గురువారం ఉదయం గ్రామశివారులో చెట్టుకు వేలాడుతూ మృతిచెంది గ్రామస్తులకు కనిపించాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు



అచ్చంపేట రూరల్: మండలంలోని భోగ మహేశ్వరం వద్ద గురువారం ఆటో బోల్తాపడి పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. ఉప్పునుంతల మండలం తాడూరు, అచ్చంపేట మండలం పులిజాలకు చెందిన కొందరు భక్తులు ఆటోలో ఉమామహేశ్వరంలోని శివుడిని దర్శించుకుని తిరిగి వస్తుండగా ఘాట్ రోడ్డులో భోగ మహేశ్వరం వద్ద ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పలువురు మహిళలు, వృద్ధులు, చిన్నారులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్ 108 వాహనంలో అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

శాంతినగర్: వ్యక్తిపై తీవ్రంగా దాడికి పాల్పడిన ఘటన శాంతినగర్‌లో చోటుచేసుకుంది. కర్నూల్ జిల్లా, గోనెగండ్ల మండలం, పెద్దమాదురి చెందిన మహ్మద్ ఇలియాస్ శాంతినగర్‌లోని చికెన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. రాత్రి సమయంలో కోళ్లఫారంలోనే పడుకునేవాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తండ్రి కటిక ఖాజావలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు శాంతినగర్ పోలీసులు తెలిపారు.

బదిలీలు జరిగేనా..?


మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం

- దేవాదాయశాఖలో 22 ఏళ్లుగా ఒకేచోట పాతుకుపోయిన ఉద్యోగులు
- ఇదే అదునుగా కొందరు మోసాలకు పాల్పడుతున్న వైనం
- దొంగ లెక్కలు, టికెట్లు, రశీదుల ప్రింటింగ్‌తో చేతివాటం
- కొత్త కమిషనర్ అయినా దృష్టి సారించాలని విజ్ఞప్తి

జోగుళాంబ శక్తిపీఠం: దేవాదాయశాఖలోని పరిపాలన ఉద్యోగులకు 22 ఏళ్లుగా బదిలీలు కావడం లేదు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 6- ఏ, బీ, సీ, డీ కింద 50 ఆలయాలు ఉండగా.. ఇందులో రికార్డు అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు ఇలా మొత్తం సుమారు 90 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో బదిలీల విషయంలో జీఓ నంబర్ 888లోని కొన్ని నిబంధనలు అడ్డొచ్చేవి. అయితే 2019లో ఆలయ ఉద్యోగులను బదిలీ చేసే అంశంలో వెసులుబాటు కల్పిస్తూ మరో జీఓను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. బదిలీల విషయంలో రెండేళ్ల కిందట ఆర్థికశాఖ నుంచి అనుమతులు, మార్గదర్శకాలు పూర్తయ్యాయి.

ఇప్పుడైనా..

సమాచారశాఖ కమిషనర్‌గా ఉన్న ఎం.హనుమంతరావు ఇటీవల దేవాదాయశాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు తీసుకున్నారు. ఈయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆకస్మిక తనిఖీలు చేపడుతూ అటు ఏసీలు, ఇటు ఈఓలకు ముచ్చెమటలు పట్టిస్తూ పరిపాలన విభాగాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. వేసవి సందర్భంగా అన్ని ఆలయాల్లో చలువ పందిళ్లు, భక్తులకు తాగునీరు, అన్నదానం, దివ్యాంగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్ సౌకర్యం, దాతలకు సముచిత గౌరవం, ఆలయ భూముల సంరక్షణ ఇలా అనేక అంశాలపై దృష్టిసారించి అధికారులను ఉరుకులు పరుగులు పెట్టించారు. మరి ఉద్యోగుల బదిలీల ప్రక్రియ చేపడతారా? లేదా? వేచి చూడాలి మరి.

ఉద్యోగులను బదిలీ చేయాలి..



దీర్ఘకాలంగా ఒకే ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలి. తద్వారా పారదర్శకత పెరుగుతుంది. స్థానిక నేతల నుంచి ఉద్యోగులపై ఒత్తిడులు కూడా తగ్గుతాయి. మరింత ఉత్సాహంగా పని చేస్తారు.

– జయపాల్‌రెడ్డి, అధ్యక్షుడు, మహబూబ్‌నగర్ జిల్లా ఆలయ ఉద్యోగుల సంఘం

ప్రక్షాళన జరగాలంటే..



ఏళ్ల తరబడి ఒకేచోట ఉద్యోగి పని చేస్తుంటూ అవినీతికి ఆస్కారం ఏర్పడుతుంది. అన్నిశాఖల్లాగే దేవాదాయశాఖలోనూ ఉద్యోగుల బదిలీలు జరగాలి. చాలా ఏళ్లుగా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ల బదిలీలు కావడం లేదు. వారిని కూడా బదిలీ చేయాలి.

– టి.రాజశేఖరశర్మ, భక్తుడు

అవినీతి.. చేతివాటం.. మోసాలు

బదిలీల ప్రక్రియ చేపట్టకపోవడంతో చాలా ఆలయాల్లో ఉద్యోగులు అవినీతి, చేతివాటం, మోసాలకు పాల్పడిన ఘటనలున్నాయి. తమను కదిలించే నాథుడే లేడంటూ కొందరు ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. కొందరు ఉద్యోగులు ఆలయాల భూములను బహిరంగ వేలంలో కౌలుకు ఇవ్వకుండా గుట్టుచప్పుడు తమ అనుచరులకు ఇచ్చుకున్నారు. ఈ విషయం పత్రికల్లో వచ్చినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో మరింత రెచ్చిపోతున్నారు. రికార్డుల్లో దొంగ లెక్కలు, టికెట్లు, రశీదు పుస్తకాలు సొంతంగా ప్రింట్ చేయించుకొని అవినీతికి పాల్పడుతున్నారు. బంగారు ఆభరణాలకు సంబంధించి రశీదులు సైతం ఇవ్వడం లేదు. హుండీలోని మిశ్రమ బంగారు, అలాగే ఆలయంలోని బంగారు, వెండి ఆభరణాలకు ఇన్సూరెన్స్ చేయించడం లేదు. ఓ ప్రముఖ ఆలయంలోని ఓ ఉద్యోగి ఏకంగా హైందవ భక్తురాలిని ఇతర వర్గానికి చెందిన వ్యక్తికిచ్చి వివాహం చేసేందుకు గట్టి ప్రయత్నం చేశారు. దీంతో తల్లిదండ్రులు ఆలయ అధికారులు, వీహెచ్‌పీ, హైందవ సంఘాలను ఆశ్రయించడంతో వారు వచ్చి దేవదాయశాఖ ఉన్నతాధికారులను నిలదీయడంతో సదరు ఉద్యోగిని తాత్కాలికంగా సస్పెండ్ చేసి తిరిగి ఇదే జిల్లాలోని మరో ఆలయానికి డిప్యూటేషన్‌పై పంపించారు. ఇలా చెబుతూపోతే అనేక అవినీతి, మోసాలు జరిగాయి.

మార్మోగిన అంజన్న నామస్మరణ


రథం వద్ద భక్తులు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలో గురువారం అంజన్న నామస్మరణ మార్మోగింది. అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన సీతారాముల కల్యాణం, హనుమాన్ రథోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ముందుగా ఆలయంలో ప్రధాన అర్చకులు అభయాంజనేయస్వామికి పంచామృతాభిషేకం, వ్యాసపూజ చేశారు. మధ్యాహ్నం సీతారామస్వామి కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ సీతారాముల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేడుక జరిపించారు. అనంతరం బలిహరణం నిర్వహించారు. సాయంత్రం రథంగ హోమం, రాత్రికి కుంభం పూజల అనంతరం స్వామివారు ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కొలువుదీరగా.. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఈసందర్భంగా జై హనుమాన్ స్మరణ మార్మోగింది. అంజన్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పలువురు భక్తులు దాసంగాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన మిఠాయి, బొమ్మలు, గాజుల దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా కనిపించాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామన్‌గౌడ్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

జూరాలలో స్వల్పంగా పెరిగిన నీటిమట్టం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా వస్తున్న వరదతో నీటిమట్టం పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. స్థానికంగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి వచ్చి చేరుతున్న స్వల్ప ఇన్‌ఫ్లోతో ప్రాజెక్టులో నీటిమట్టం పెరిగింది. ఈ క్రమంలో గురువారం జూరాల ప్రాజెక్టుకు 134 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 3.732 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కొద్దిమేర నీటిమట్టం పెరగడంతో మిషన్ భగీరథ తాగునీటికి గండం గట్టెక్కినట్లయ్యింది. ప్రాజెక్టు నుంచి 134 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.


జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

నిజాయితీ చాటిన ఆర్టీసీ ఉద్యోగులు


బాధితురాలికి బ్యాగ్‌తో పాటు బంగారం ఆభరణాలు అందజేస్తున్న డీఎం సుభాషిణి, ఉద్యోగులు

కల్వకుర్తి టౌన్: బస్సులో ఓ ప్రయాణికురాలు మరిచిపోయిన బ్యాగును ఆర్టీసీ ఉద్యోగులు అప్పగించి, నిజాయితీ చాటారు. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన ఫాతిమా బుధవారం సాయంత్రం తన కుటుంబ సభ్యులతో కలిసి జడ్చర్ల నుంచి మహబూబ్‌నగర్ వెళ్లేందుకు కల్వకుర్తి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఎక్కింది. మహబూబ్‌నగర్‌లో బస్సు దిగే క్రమంలో తన బ్యాగ్‌ను బస్సులోనే మరిచిపోయింది. గమనించిన కండక్టర్ ఫర్జానా, డ్రైవర్ కృష్ణలు సంబంధిత బ్యాగ్‌ను భద్రపర్చి, డీఎం సుభాషిణికి అందజేశారు. ఈక్రమంలో ప్రయాణికురాలు ఫాతిమా అదే రోజు రాత్రి మహబూబ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం పోలీసులు డిపో మేనేజర్‌ను సంప్రదించగా.. బ్యాగ్ డిపోలోనే ఉందని సమాచారం ఇచ్చారు. దీంతో బాధితురాలు డిపోకు చేరుకోగా.. బ్యాగ్‌తో పాటు అందులో ఉన్న రూ. 4 లక్షల విలువగల 6 తులాల బంగారం ఆభరణాలను అందజేశారు. కార్యక్రమంలో డిపో ఉద్యోగి సుందర్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు


పట్టుబడ్డ వాహనం, బెల్లంతో ఎక్సైజ్ సిబ్బంది

కల్వకుర్తిరూరల్: ఎక్సైజ్ సిబ్బంది విస్తృత తనిఖీలు, దాడులు నిర్వహించినట్లు సీఐ వెంకట్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ దాడులలో సారా, పటిక స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వంగూరు మండలం, కిస్టియన్‌పల్లి తండాలో 19 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, రెండు కేసులు నమోదు చేసి, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని కొట్ర చౌరస్తాలో డిండి మండలం, చెరుకుపల్లి చెందిన కృష్ణ, అమ్రాబాద్‌కు చెందిన రవి, తర్నికల్‌కు చెందిన జగన్ కర్ణాటకలోని బీదర్ నుంచి నల్లబెల్లం తీసుకువస్తుండగా పట్టుబడ్డారని చెప్పారు. ముగ్గురిపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేశామన్నారు. దాడులలో సీఐ శారద, ఎస్‌టీఎఫ్ ఎస్‌ఐ సాయికిరణ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భయం గుప్పిట్లో తూడుకుర్తివాసులు

చిరుత సంచరించడంతో భయందోళన

నాగర్‌కర్నూల్: మండలంలోని తూడుకుర్తి పరిసర ప్రాంతాలలో బుధవారం చిరుతపులి సంచరిస్తుందని గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. కంగారం గ్రామ ప్రజలు పంట పొలాల్లోకి వెళ్లి వస్తున్న సందర్భంలో జింకను తరుముతూ చిరుతపులి కనిపించిందని తూడుకుర్తి పరిసర ప్రాంతాలలోకి వెళ్లిందని ఆ గ్రామ రైతులు ఇచ్చిన సమాచారం మేరకు ప్రజలు భయం గుప్పిట్లో మగ్గుతున్నారు. అయితే బుద్దారం అడవి ప్రాంతాల నుంచి అధిక మొత్తంలో జింకలు ఉండడం వల్ల చిరుత వాటిని వెంబడిస్తూ ఇటుగా వచ్చిందని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై నాగర్‌కర్నూల్ రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ పర్వేష్‌అహ్మద్ విషయం తెలుసుకుని సిబ్బందిని గ్రామానికి పంపించారని అయితే అక్కడ చిరుతకు సంబంధించిన జాడలు, కదలికలు కనిపించలేదని తెలిపారు. అడవి ప్రాంతంలో సోలార్ బోర్‌ల వద్దకు జింకలు గుంపులు ఎక్కువగా వస్తుంటాయని వాటి కోసం చిరుతలు సంచరించి ఉండొచ్చని, తూడుకుర్తి ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రి వెనకభాగంలో గల గుట్టల్లోకి ఈ చిరుత వెళ్లిందని గ్రామస్తులు చెప్తున్నారు. ఒంటరిగా రైతులు, మహిళలు పొలాల్లోకి వెళ్లొద్దని ఫారెస్ట్ అధికారులు సూచిస్తున్నారు. అయితే బుధవారం రాత్రి ఈ విషయమై తూడుకుర్తి గ్రామస్తులు గ్రామంలో చాటింపు వేసి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు.

ఫారెస్ట్ కందకంలో పడి మహిళ మృతి

పెద్దకొత్తపల్లి: ప్రమాదవశాత్తు ఫారెస్ట్ కందకంలో పడి ఓ మహిళ మృతిచెందిన ఘటన పెద్దకొత్తపల్లి మండలం మారేడుమాన్‌దిన్నెలో చోటుచోటుచేసుకుంది. ఎస్‌ఐ సతీష్ వివరాల మేరకు.. దేవినేనిపల్లికి చెందిన కల్మూరు మంజుల (30)కు కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేదు. గురువారం స్వగ్రామం నుంచి మారేడుమాన్‌దిన్నెకు బయల్దేరిన ఆమె.. మార్గమధ్యంలో ఉన్న ఫారెస్ట్ కందకంలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందింది. గమనించిన గొర్రెల కాపరులు విషయాన్ని గ్రామస్తులకు తెలియజేయడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలికి భర్త రామకృష్ణ, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతురాలి తండ్రి మాసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిన్నారులపై కుక్క దాడి


గాయపడిన బాలుడు

శాంతినగర్: మండలంలోని బుడమర్సు చెందిన ఆరుగురు చిన్నారులు నవీన్, విజయ్, ఆరీఫ్, ప్రవీణ్, మస్తాన్, రామాంజనేయులును పిచ్చికుక్క కరిచిందని స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చినట్లు తెలిపారు. పిచ్చికుక్కలను అరికట్టాలని అధికారులను గ్రామస్తులు కోరారు.

వృద్ధురాలి బలవన్మరణం

ఊర్కొండ: మండలంలోని బొమ్మరాజుపల్లిలో ఓ వృద్ధురాలు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాచర్ల చంద్రమ్మ (75) ఒంటరితనంతో బాధపడటంతో పాటు కుమార్తెలు, కుమారుల మధ్య భూ తగాదాలతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఉరేసుకుంది. గురువారం ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో ఇరుపొరుగు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కుమారుడు అల్లాజి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు.

విద్యుత్ మోటార్ల కేబుల్ చోరీ

వంగూరు: మండలంలోని తిప్పారెడ్డిపల్లి శివారులో బోరుమోటార్ల కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బుధవారం రాత్రి దాదాపు 50 మంది రైతులు వ్యవసాయ పొలాల్లో బోరుమోటార్ల సర్వీస్ వైరును ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

వైభవంగా లక్ష్మీనారసింహుడి కల్యాణం


మంగళసూత్రం చూపిస్తున్న ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్


అలంకరణలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవతామూర్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీలక్ష్మీనరసింహాస్వామి కల్యాణ మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తుల మధ్య కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. ముందుగా సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన శేషవాహనంలో శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవతామూర్తులను ఉంచి దేవస్థానంలోని గర్భగుడి నుంచి పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య ఊరేగిస్తూ ఆలయం ముందు మైదానంలో పూల అలంకరణతో తయారు చేసిన మండపం వద్దకు తీసుకొచ్చారు. భక్తుల హరినామస్మరణ మధ్య ఊరేగింపు కొనసాగింది.

సంప్రదాయబద్ధంగా..

కల్యాణోత్సవం సందర్భంగా మామిడి తోరణాలు, వివిధ రకాల పూలు, శోభాయమానంగా అలంకరించిన కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవంలో జీలకర్ర బెల్లం తదితర పూజల అనంతరం అమ్మవారికి మంగళసూత్రధారణ జరిపించారు. పురోహితుల వేదమంత్రాల మధ్య జరిగిన పవిత్ర ఘట్టాన్ని చూసి భక్తులు భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. అనంతరం శ్రీలక్ష్మీనరసింహాస్వామి దేవతామూర్తులకు పట్టువస్త్రధారణ, తలంబ్రాలు పోశారు. ఈ సందర్భంగా వివిధ బంగారు, వెండి ఆభరణాలు, రకరకాల పూల మధ్య దేవతామూర్తుల దంపతులు ధగధగ మెరిసిపోతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఈ వేడుకలను తిలకించి పునీతులయ్యారు. కల్యాణోత్సవం అనంతరం దేవతామూర్తులను శేషవాహనంలో మళ్లీ కల్యాణ మండపం నుంచి గర్భగుడిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఉత్సవాలకు హాజరైన భక్తులు చాలామంది దేవస్థానంలో కూడా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధాశ్రీ, ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోటకదిర మాజీ సర్పంచ్ రమ్య, నాయకులు వెంకటస్వామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

జోగుళాంబ ఆలయంలో భక్తజన సందోహం


చండీహోమాలు చేస్తున్న భక్తులు

- ఆలయాన్ని దర్శించుకున్న పలువురు ప్రముఖులు
- చండీహోమానికి హాజరైన భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలు గురువారం భక్తులతో కిక్కిరిశాయి. వైశాఖ మాసం అందులో పౌర్ణమి కలిసిరావడంతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ తగ్గలేదు. బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు చేశారు. అమ్మవారి ఆలయంలో ఉదయం సాయంత్రం కుంకుమార్చనలు, త్రిశతి, ఖడ్గమాల వంటి అర్చనలు చేశారు.

ఆలయంలో చండీహోమాలు

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో ప్రతి శుక్రవారం, అమావాస్య, పౌర్ణమి రోజులలో భక్తుల చేత సామూహిక చండీహోమాలు చేయిస్తుంటారు. గురువారం వైశాఖ పౌర్ణమి కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యల తరలివచ్చారు. 114 మంది ఈ హోమాలలో పాల్గొన్నట్టు ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. చండీహోమాల ద్వారా ఆలయానికి రూ.1.14లక్షల ఆదాయం చేకూరినట్లు దేవస్థానం కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.


ఆలయంలో అభిషేకాలు చేస్తున్న సింగర్ మంగ్లీ

ఆలయాన్ని దర్శించుకున్న ప్రముఖులు

ఆలయాలను పలువురు ప్రముఖులు కూడా దర్శించుకున్నారు. విజయవాడ సీనియర్ సివిల్ జడ్జి భవాని, గద్వాల అదనపు కలెక్టర్ మాసాని వెంకటేశ్వర్లు, నంద్యాల అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రథాప్‌రెడ్డి, రాయచూరు ఎమ్మెల్యే బసన్నగౌడ దద్దాల్, ప్రముఖ సింగర్ మంగ్లి ఆలయాల్లో పూజలు చేశారు.